

అంబులెన్స్‌లో తరలిస్తుండగా రైతు మృతి
- ఆక్సిజన్ లేకనే చనిపోయాడంటూ బంధువుల ఆరోపణ
- దాడి చేసి కప్పిపుచ్చుకునేందుకే: 108 కోఆర్డినేటర్ 6

చేప పిల్లలొచ్చేనా!
- ఖరారు కాని టెండర్లు 6
- ముంచు కొస్తున్న అదను

బీపీ పెరుగుతోంది

జిల్లాలో పెరుగుతున్న బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు

- దీర్ఘకాలిక రోగాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి
- సెంట్రల్ పోర్టల్ నుంచి స్టేట్ పోర్టల్‌లోకి వివరాల నమోదు
- ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు 24 గ్రామాల ఎంపిక

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జూలై 30 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లాలో బీపీ, షుగర్ రోగులు ఏటా పెరుగుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎన్‌సీడీ(నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్) సర్వేలో ఈ విషయం తేలింది. మారుతున్న జీవన ప్రమాణాలు, ఆహారపు అలవాట్ల కారణంగా అసంక్రమిత వ్యాధులైన బీపీ, షుగర్ పెరుగుతున్న నేపథ్యంలో వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అందులో భాగంగానే సెంట్రల్ పోర్టల్‌లో ఉన్న వ్యాధిగ్రస్తుల వివరాలను స్టేట్ పోర్టల్‌లోకి మార్చుకోవాలని నిర్ణయించింది. ఈమేరకు రాష్ట్రానికి అనుగుణంగా వివరాలను నమోదు చేసుకొని తదుపరి కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తోంది. అందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ జిల్లాలోని పీహెచ్‌సీల పరిధిలో కొన్ని గ్రామాలను ఎంపిక చేసి, ఎన్‌సీడీ సర్వే నిర్వహిస్తోంది. మహబూబ్‌నగర్ జిల్లాలో కూడా ఎన్‌సీడీ సర్వే పోర్టల్ కోసం 24 గ్రామాలను ఎంపిక చేసి, ట్రయల్ రన్ నిర్వహిస్తోంది.





ఎన్‌సీడీ సర్వేలో భాగంగా వృద్ధురాలికి షుగర్ పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

సెంట్రల్ పోర్టల్ నుంచి స్టేట్ పోర్టల్‌లోకి..

ఎన్‌సీడీ సర్వేలో భాగంగా జిల్లాలో ప్రతీ ఏడాది సర్వే నిర్వహిస్తారు. అందులో బీపీ, షుగర్‌తో పాటు ఓరల్, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లపై సర్వే చేసి వివరాలను నమోదు చేస్తారు. అందులో రోగికి సంబంధించిన పూర్తి వివరాలు ఉంటాయి. ఈ వివరాలను సెంట్రల్‌కు సంబంధించిన పోర్టల్‌లో నమోదు చేసేవారు. దీనివలన రాష్ట్రంలో ఏవైనా మార్పులు చేయాలన్నా, కార్యక్రమాలు చేపట్టాలన్నా.. సెంట్రల్ నుంచి అనుమతి తీసుకొని చేయాల్సి ఉండేది. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్రానికి సంబంధించిన పోర్టల్‌లోనే నమోదు చేస్తే బాగుంటుందని భావించి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

జిల్లాలో 24 గ్రామాల ఎంపిక..

జిల్లాలోని 24 పీహెచ్‌సీల పరిధిలో ఒక్కో గ్రామం చొప్పున 24 గ్రామాలను ఎంపిక చేశారు. రాంచంద్రాపూర్, సంకలమద్ది, గౌతాపూర్, గోప్లాపూర్, గూడూరు, పుట్టపల్లి, గూరకొండ, రంగారెడ్డిపల్లి, శేక్‌పల్లి, దాచక్‌పల్లి, నసరుల్లాబాద్, మల్లాపూర్, రాంపూర్, ఓబ్లాయపల్లి, వడియాల్, గురుకుంట, ముదిరెడ్డిపల్లి, సున్నంబట్టి గ్రామాలు ఉన్నాయి. అదేవిధంగా జిల్లా కేంద్రంలోని యూపీహెచ్‌ల పరిధిలో మార్కెట్ రోడ్, న్యూప్రేమ్‌నగర్, టీడీగుట్ట, హనుమాన్‌పుర, కిద్వాయిపేట కాలనీలను ఎంపిక చేశారు. సర్వే చివరి దశలో ఉంది.

పెరుగుతున్న బీపీ, షుగర్ కేసులు

జిల్లాలో ఎన్‌సీడీ మొదటి విడత సర్వే 2019లో చారు. బీపీ రోగులు 36,286 మంది, షుగర్ వ్యాధిగ్రస్తులు 19,607 మంది ఉన్నారు. రెండో విడత సర్వే 2021లో నిర్వహించగా బీపీ రోగులు 74,447 మంది, షుగర్ వ్యాధిగ్రస్తులు 44,871 మంది, మూడో విడత సర్వే 2024లో చేపట్టగా, బీపీ రోగులు 91,571 మంది, షుగర్ రోగులు 52,886 మంది ఉన్నారు. ఈ లెక్కన ఏటా రోగులు పెరుగుతూనే ఉన్నారు.

పదోన్నతుల ప్రక్రియ షురూ

- ఉమ్మడి జిల్లాలో 450 మంది ఉపాధ్యాయులకు వచ్చే అవకాశం
- మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల వారికే అధికం
- సీనియారిటీ ఖాళీలపై విద్యాశాఖ కసరత్తు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పదోన్నతులకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపడంతో విద్యాశాఖ అందుకు కసరత్తు ప్రారంభించింది. పదోన్నతులకు నేడో, రేపో పాఠశాల విద్యాశాఖ షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉండటంతో జిల్లా విద్యాశాఖ యంత్రాంగం డీఈవో కార్యాలయం నుంచి మెట్టుగడ్డలోని ఆర్‌వీఎం సమావేశ మందిరానికి మారారు. పదోన్నతుల ప్రక్రియకు సంబంధించి ఏడీ, సూపరింటెండెంట్‌లు, కార్యాలయ సిబ్బంది, ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో బుధవారం 13 కమిటీలు వేశారు. ఒక్కొక్కరికి ఒక సబ్జెక్టు, మీడియం చొప్పున బాధ్యతలు అప్పజెప్పారు. సబ్జెక్టులో మొత్తం ఎన్ని ఖాళీలు ఉన్నాయి?, ఉంటే ఎక్కడ ఉన్నాయి?, ఉపాధ్యాయుల సీనియారిటీ సరిగా ఉందా? అన్న విషయాలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు.



జిల్లా కేంద్రంలోని ఆర్‌వీఎం సమావేశ మందిరంలో పదోన్నతుల ప్రక్రియను పరిశీలిస్తున్న విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అనురాధ

వివరాలు సిద్ధం చేస్తున్న విద్యాశాఖ

అన్ని జిల్లాల విద్యాశాఖ అధికారులతో పాఠశాల విద్యాశాఖ అధికారులు బుధవారం హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించారు. దీంతో షెడ్యూల్ వెలువడే అవకాశం ఉంది. స్కూల్ అసిస్టెంట్స్‌కు జీహెచ్‌ఎం, ఎస్‌జీటీలకు స్కూల్ అసిస్టెంట్, భాష పండితుల అప్‌గ్రేడేషన్ చేపట్టనుండటంతో ఉపాధ్యాయుల వివరాలను సిద్ధం చేస్తున్నారు.

450 మందికి అవకాశం

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 450 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 70 మంది జీహెచ్‌ఎంలు జోన్-2 లో గజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతులు రానున్నాయని సమాచారం. గతంలో అప్‌గ్రెడేషన్‌లో పదోన్నతులు రాని సుమారు 70 మందికిపైగా తెలుగు, హిందీ, ఉర్దూ భాషలకు చెందిన భాషా పండితులు స్కూల్ అసిస్టెంట్స్‌గా, 300 మంది ఎస్‌జీటీలు స్కూల్ అసిస్టెంట్స్‌గా పదోన్నతి పొందొచ్చని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. మరో పది మంది పీఈటీలకు పీడీలుగా ఉద్యోగోన్నతి వచ్చే అవకాశం ఉంది. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోనే ఎక్కువ మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు వచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం.

జడ్చర్లకు బైపాస్ మంజూరు చేయండి

- కేంద్ర మంత్రికి ఎంపీ అరుణ, ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, అనిరుధ్‌రెడ్డి వినతి



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతి పత్రం ఇస్తున్న ఎంపీ అరుణ; చిత్రంలో ఎమ్మెల్యేలు అనిరుధ్‌రెడ్డి, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

జడ్చర్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్లకు నూతనంగా బైపాస్‌ను మంజూరు చేయాలంటూ కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి బుధవారం వినతిపత్రం అందించారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని వారు కలిశారు. జడ్చర్ల బైపాస్ రోడ్డు అవశ్యకతను వివరించారు. 44వ జాతీయ రహదారి నుంచి 167వ జాతీయ రహదారిని కలుపుతూ మళ్లీ 44వ జాతీయ రహదారికి అనుసంధానం అయ్యేలా బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలంటూ కోరారు. జడ్చర్ల పట్టణంలో 44వ, 167వ జాతీయ రహదారులపై వాహనాల రద్దీ అధికంగా ఉందని, పట్టణ ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బైపాస్‌ను మంజూరు చేయాలని కోరారు. బైపాస్ మంజూరు చేసేందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ బైపాస్ రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కోరారు.

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెరగాలి

- హాస్పిటల్‌లోనే ప్రసవం చేయించుకునేలా మహిళలకు అవగాహన కల్పించాలి
- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్



పీహెచ్‌సీలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

నారాయణపేట రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం పెరగాలని, హాస్పిటల్‌లోనే ప్రసవం చేసుకునేలా మహిళలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ చెప్పారు. బుధవారం నారాయణపేట మండలం కోటకొండ పీహెచ్‌సీని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఓపీ తక్కువగా ఉండటం గమనించిన కలెక్టర్ అక్కడి డాక్టర్‌ను వివరణ కోరారు. అదేవిధంగా ఎన్‌సీడీపీ ప్రోగ్రాం గురించి అడిగి తెలుసుకున్నారు. దాదాపు ఆరువేలకు పైగా జనాభా కలిగిన ఈ ప్రాంతంలో గత మార్చి, ఏప్రిల్ నెలలో ఒక్క డెలివరీ కాలేదని రిజిస్టర్‌లో రాయడం, ఈడీడీ అప్‌డేట్ లేకపోవడం, జూలై నెలలో కేవలం రెండు డెలివరీ మాత్రమే జరిగాయని తెలిసి కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ పరిధిలోని పది సబ్ సెంటర్లకు గాను 16 మంది డాక్టర్లు ఉన్నా ప్రోగ్రాం అధికారులు ఎందుకు విజిట్ చేయడం లేదని డాక్టర్‌ను ప్రశ్నించారు. తనిఖీ సమయంలో ఆస్పత్రి రిజిష్టర్లు అందుబాటులో లేకపోవడంపై సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. వైద్య సేవల గురించి రోగులతో మాట్లాడారు. వ్యాక్సిన్లు ఎల్‌ఎఫ్ మిషన్‌లో పెట్టకపోవడం చూసి ప్రశ్నించగా.. మిషన్ చెడిపోయిందని సమాధానం చెప్పడంతో మరీ ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎలా అని ప్రశ్నించారు. అనంతరం కలెక్టర్ గ్రామంలో శీలం రాజేశ్వరి నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు.

జడ్పీ పాఠశాల పరిశీలన

మండలంలోని బొమ్మన్‌పాడ్ జడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం కలెక్టర్ సిక్తాపట్నాయక్ పరిశీలించారు. ఎఫ్ఏ-1 పూర్తయిందా అని ప్రశ్నించారు. ఆ మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

గత ప్రభుత్వం చేసిందేమీ లేదు

- దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి



రేషన్ కార్డు ప్రొసిడింగ్ అందజేస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర, జూలై 30(ఆంధ్రజ్యోతి): గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 10 ఏళ్ల రాష్ట్రాన్ని పాలించి చేసిందేమీ లేదని ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం దేవరకద్రలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ విజయేందిర బోయి భూమి పూజ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క రేషన్‌కార్డు, డబుల్ బెడ్ రూమ్‌లు ఇచ్చిన ఘనత ఎక్కడైనా ఉందా? అని ప్రశ్నించారు. ఒక్క అభివృద్ధి పని కూడా చేయకుండా రూ.కోట్లు సంపాదించుకున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులను తీర్చుకుంటూ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. కొత్త రేషన్‌కార్డు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం వంటివి అమలు చేశామన్నారు. రైల్వే అధికారులతో మాట్లాడి అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపడతామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, కురుమూర్తి ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కతలప్ప, తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంజీల్ రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యటనల జోరు

స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రధాన పార్టీల పోటాపోటీ సమావేశాలు

- ప్రభుత్వ సంక్షేమ పథకాలపై కాంగ్రెస్ ప్రచారం
- గవర్నమెంట్ వైఫల్యాలను ఎండగడుతున్న బీజేపీ, బీఆర్‌ఎస్
- సమస్యలపై ఉద్యమిస్తున్న వామపక్ష నాయకులు







నారాయణపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నారాయణపేట జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు పోటాపోటీగా పర్యటిస్తున్నారు. దాంతో జిల్లాలో ఎన్నికల వేడి నెలకొంది. అధికార కాంగ్రెస్ పార్టీకి సంబంధించి రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, సీఎం సోదరుడు, కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్‌రెడ్డి జిల్లాలో పర్యటిస్తున్నారు. వారితో పాటు కాంగ్రెస్ నారాయణపేట నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్‌రెడ్డి పర్యటనలు చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలైన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, కొత్త రేషన్ కార్డులు, కుట్టు మిషన్లు అందిస్తున్నారు. మరోవైపు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేసి, స్థానిక ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు హస్తగతం చేసుకోవాలని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేస్తున్నారు.

వైఫల్యాలపై బీఆర్‌ఎస్ ఫోకస్

బీఆర్‌ఎస్ పార్టీకి సంబంధించి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్ఆర్ రెడ్డి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి జిల్లాలో పర్యటిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు వివరించి స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా మందుకు సాగాలని పిలుపునిస్తున్నారు.

కేంద్ర పథకాలపై బీజేపీ ప్రచారం

బీజేపీ విషయానికి వస్తే ఆ పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ జిల్లాలో పలు కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటున్నారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రాంచందర్‌రావు జిల్లాలో తొలిసారి పర్యటించి, శ్రేణుల్లో జోష్ నింపారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలన వైఫల్యాలు ప్రజలకు వివరించి, కేంద్ర ప్రభుత్వ పథకాలతో పాటు ప్రధాని మోదీ సాధించిన ప్రగతిని వివరించాలని వారు కార్యకర్తలకు చెబుతున్నారు. వామపక్ష పార్టీలైన సీపీఎం, సీపీఐ(ఎంఎల్), సీపీఐ నాయకులు ప్రజా సమస్యలపై ఉద్యమిస్తున్నారు. తమ ఉనికిని చాటుతూ స్థానిక పోరుకు సమాయత్తం చేస్తున్నారు.

విద్యాభివృద్ధి దిశగా..
- ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ బోధన
- ఎల్‌కేజీ, యూకేజీ అడ్మిషన్లు ప్రారంభం
- ప్రతీ పాఠశాలలో వసతుల కల్పనకు రూ.1.50 లక్షల నిధులు
- ఆగస్టు 15లోపు పాఠశాలలు ప్రారంభం చేసేందుకు చర్యలు
- ఉమ్మడి జిల్లాలో 94 స్కూల్స్‌లో ఏర్పాట్లు

7

వారికి రెండో విడతలో

ఇందిరమ్మ ఇళ్లు

- ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

హైదరాబాద్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మొదటి విడతలో రాని వారికి రెండో విడతలో కచ్చితంగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని కాంగ్రెస్ ఎమ్మెల్యే పర్ణికారెడ్డి తెలిపారు. గత పదేళ్లలో బీఆర్‌ఎస్ పార్టీ రేషన్ కార్డులు ఇవ్వకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారన్నారు. కానీ ప్రస్తుతం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజాపాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని చెప్పారు. గాంధీ భవన్‌లో బుధవారం నిర్వహించిన 'అందుబాటులో ప్రజాప్రతినిధులు' కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. టీపీసీసీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు తదితర సమస్యలపై పలు వినతులు వచ్చాయని తెలిపారు. వారి వినతులు స్వీకరించి, పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు చేరవేశానన్నారు. ప్రజలకు చేరువ అయ్యేందుకు ఈ కార్యక్రమం మరింత దోహద పడుతుందని పర్ణికారెడ్డి చెప్పారు.

కోస్గి ఇంజనీరింగ్ కళాశాలకు ఏడాది
- ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో మంజూరు
- అన్ని హంగులతో ప్రారంభమైన భవన నిర్మాణ పనులు

7

హెచ్‌సీఏ 2లీగ్‌లో మహబూబ్‌నగర్ గెలుపు

7

2న కొల్లాపూర్‌కు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క రాక



ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

కొల్లాపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆగస్టు 2వ తేదీన కొల్లాపూర్ నియోజకవర్గ కేంద్రానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కొల్లాపూర్‌కు రానున్నారని రాష్ట్ర పర్యాటక ఎక్సైజ్ సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బుధవారం పేర్కొన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. కొల్లాపూర్ నియోజకవర్గానికి మంజూరైన కొత్త విద్యుత్ సబ్ స్టేషన్‌ల భూమి పూజ కార్యక్రమానికి హాజరవుతున్నారని తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలో రైతులకు మంజూరైన 400 ట్రాన్స్‌ఫార్మర్లను కూడా రైతులకు అందజేస్తామన్నారు. అదే విధంగా ప్రజా పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నూతన రేషన్ కార్డులను అర్హులైన వారందరికీ పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు హాజర వుతారని ఆయన పేర్కొన్నారు.

ప్రతీ ఇంటికి సురక్షితమైన నీరు

» భగీరథ సీఈ మధుబాబు



మిషన్ భగీరథ పథకాన్ని పరిశీలిస్తున్న సీఈ (ఓఅండ్ఎం) మధుబాబు, అధికారులు

వీపనగండ్ల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతీ ఇంటికి సురక్షితమైన తాగునీరు అందిస్తున్నట్లు మిషన్ భగీరథ సీఈ (ఓఅండ్ఎం)మధుబాబు, మహబూబ్‌నగర్, రంగారెడ్డి సీఈ లలిత తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని భగీరథ తాగునీటి పథకం గోపాల్‌దిన్నె రిజర్వాయర్‌లోని తాగునీటి పథకాలను ఆమెతో పాటు అధికారులు సందర్శించారు. ఫిల్టర్ బెడ్స్ పని చేస్తున్న పని తీరు సమస్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. నీటిని శుద్ధి చేసే విధానాన్ని పరిశీలించారు. తాగునీటి సరఫరాలో ఉన్న వసతులు మెరుగైన వసతుల కల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మొక్కలను నాటారు. తాగునీరు కలుషితం కాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. పైపులైన్లు ఎక్కడైనా లీకేజీ అయితే స్పందించి మరమ్మతులు చేపట్టాలని, తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భగీరథ ఎస్ఈ వెంకటరమణ, రాజయ్య, ఈఈ సుధాకర్‌సింగ్, రాజు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు అడిగితే జైలుకు పంపుతారా..

» చెంచు వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చిగుర్ల మల్లిఖార్జున్



చెంచు రైతులను అరెస్టు చేసి ఠాణాకు తరలించిన పోలీసులు

బ్రహ్మగిరి జూలై 30 (ఆంధజ్యోతి): హక్కులు అడిగితే జైలుకు పంపుతారా? అని చెంచు వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చిగుర్ల మల్లిఖార్జున్ అన్నారు. అడవి హక్కుల చట్టం 2006లోని ఫారం-ఎ ద్వారా రాసామాల్లోని బాయి దగ్గర ఉన్న 10 మంది సాగు భూమిహక్కు పత్రాలు 2010లో వచ్చాయి. సాగుచేస్తున్న భూమిని ఆపాలని అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. ఇందుకు గాను గత మే 28న శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై 5 నిమిషాల రాస్తారోకో చేసినందుకు చెంచులు కుడుముల బొడయ్య, పోత్తయ్య, వెంకటయ్య, మనయ్య, చౌటి, పోత్తయ్యలపై కేసు నమోదు చేశారు. వారిని బుధవారం అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీహక్కుల చట్టం 2006, 2012 నిబంధనల ప్రకారంగా చట్టాన్ని ముందుకు నడపాల్సిన బాధ్యత వీరిదే.. కానీ నియమ నిబంధనలకు చట్ట ఉల్లంఘన జరగడానికి కారుకులు మేము కాదు.. ఈ ప్రభుత్వ అధికారులు కారకులన్నారు. మాపై ఎన్ని కేసులు పెట్టినా భరిస్తాం.., మా హక్కులు చట్టాలు అమలు య్యేదాకా పోరాటాలు ఆపేదిలేదన్నారు. ఏ తీర్మానం ఇచ్చినా 90రోజుల్లో పరిష్కారం చూపాలన్నారు.

ఎక్సైజ్ వాహనాల వేలంలో రూ.72,892 ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి

కొల్లాపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన 7 ద్విచక్ర వాహనాలకు పట్టణంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద జిల్లా ఎక్సైజ్ అధికారి గాయత్రి సమక్షంలో బుధవారం వేలం నిర్వహించారు. వేలంలో ప్రభుత్వం ధర రూ.49,500 నిర్ణయించగా, దీని ద్వారా రూ.72,892 (47.2 శాతం అదనంగా) వచ్చినట్లు ఎక్సైజ్ సీఐ నాగిరెడ్డి పేర్కొన్నారు.

బేస్ క్యాంప్ వాచర్‌కు సీఎఫ్ అవార్డు



సీఎఫ్ అవార్డు అందుకున్న చెంచు మిర్సాల దర్గయ్య

కొల్లాపూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పులుల సంరక్షణకు కృషి చేస్తున్న సిబ్బందికి అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా జూలై 29, 2025న అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ప్రదానం చేయబడింది. అందులో భాగంగా కొల్లాపూర్ అటవీ రేంజ్ నుంచి మండల పరిధిలోని ఎర్రపెంట సెక్షన్ జాలిపెంట బేస్ క్యాంప్‌లో మొలచింతల పల్లి గ్రామానికి చెందిన బేస్ క్యాంప్ వాచర్ చెంచు మిర్సాల దర్గయ్యను సీఎఫ్ అవార్డుకు ఎంపిక చేశారు. ఈ అవార్డును ఎఫ్‌డివో ఫ్లయింగ్ స్క్వాడ్ పార్టీ రామ్మోహన్ చేతుల మీదుగా మన్న నూరులో బుధవారం మిర్సాల దర్గయ్య అవార్డు అందుకోవడం జరిగింది.

చేప పిల్లలొచ్చేనా..!

» ఖరారు కాని టెండర్లు

» ముంచుకొస్తున్న అదను

» ఆలస్యమైతే అంతే సంగతులు



చెరువులో వదులుతున్న చేపపిల్లలు(ఫైల్)

పాలమూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండాలని ప్రతీ ఏటా ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తోంది. గతేడాది కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం అదే పని చేసింది. జిల్లాలో గతేడాది 1091 చెరువులు, కుంటలు, కోయిల్‌సాగర్ రిజర్వాయర్‌లో సుమారు 1,93,78,000 (ఒక కోటి 93లక్షల 78 వేలు) చేపపిల్లలను వదిలారు. ప్రతీ సీజన్‌లో ఆయా చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో సుమారు రూ.తొమ్మిది కోట్ల చేపపిల్లలను ఉచితంగా వదిలే వారు. ఈ ఏడాది ఉచిత చేపపిల్లల పంపిణీ ఉందా..! లేదా..! అనే దానిపై మత్స్యకారుల్లో ఉత్కంఠ నెలకొంది. వానాకాలం ప్రారంభమై ఇప్పటికే రెండు నెలలు అవుతోంది. ఎందుకంటే జూలై మాసం ముగుస్తున్నా నేటికీ ఉచిత చేపపిల్లల పంపిణీపై ఇంకా స్పష్టత ఇవ్వకపోవటంతో అనుమానాలకు తావిస్తోంది. వానాకాలం సీజన్‌కు ముందే టెండర్లు పిలవాలి. లేదంటే జలాశయాలు నిండాక అదనుకు పిల్లలను పంపిణీ చేయలేరు. గతంలో చేపపిల్లల సరఫరాకు టెండర్ల ప్రక్రియ ఇప్పటికే మొదలయ్యేది. మేలోనే టెండర్లు ముగిసి, కాంట్రాక్టర్లు సీజన్ మొదలయ్యే లోపు చేప పిల్లలను సిద్ధం చేసుకునేవారు. ఆగస్టులో చెరువులు నిండిన వెంటనే 100శాతం ఉచిత చేప పిల్లలను వదలడంతో ఎదుగుదల బాగుండేది. ఈ ఏడాది జూలై ముగుస్తున్నా చేపపిల్లల పంపిణీపై మత్స్యశాఖ అధికారులు స్పష్టత ఇవ్వలేదు. సంబంధిత మంత్రిత్వ శాఖ నుంచి ఎలాంటి సమాచారం లేదంటున్నారు.

ఆదేశాలు రాలేదు



ఉచిత చేప పిల్లల పంపిణీపై టెండర్లపై ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేస్తే జిల్లా స్థాయిలో ప్రక్రియ మొదలవుతుంది. ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నం. తొందరలోనే ఆదేశాలు వచ్చే అవకాశముంది.

- డి.రాధా రోహిణి, జిల్లా మత్స్యశాఖాధికారి

ఆలస్యమైతే చేప పిల్లల పంపిణీ అంతే..

సరైన సమయంలో జలవనరుల్లో చేప పిల్లలను వదలటంతోనే ఎదుగుదల, లేకుంటే సక్రమంగా ఉండదు. ఆగస్టు, సెప్టెంబర్ రెండో వారంలోపే పెంపకం మొదలుతోనే మంచి దిగుబడి వస్తుంది. లేదంటే ఏ రకమైనా సరే చేప బరువు అంతంత మాత్రమే. ఆలస్యమవటంతో కాంట్రాక్టర్లు నాసిరకం చేప పిల్లల్ని మత్స్యకారులకు అంటగడతారు. ఉన్నతాధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సకాలంలో టెండర్లు నిర్వహించేందుకు చర్యలు చేపట్టేలా చూడాలని కోరుతున్నారు.

విద్యార్థుల మరణాలు ప్రభుత్వ హత్యలే

» ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు

» ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉయ్యాలవాడ బీసీ గురుకుల పాఠశాల వద్ద నిరసన

» అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు



బీసీ బాలికల గురుకుల పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఏబీవీపీ మహిళా కార్యకర్తను లాక్కెళుతున్న పోలీసులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, వసతి గృహాల్లో జరుగుతున్న విద్యార్థుల మరణాలు, అస్వస్థతలకు ప్రభుత్వమే కారణమని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి మాచర్ల రాంబాబు ఆరోపించారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడ బీసీ బాలికల గురుకుల పాఠశాల వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పాఠశాల గేటు వద్ద బైటాయించి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా 94 మంది విద్యార్థులు వివిధ కారణాలతో చనిపోయారని పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ బీసీ బాలికల గురుకుల పాఠశాలలో దాదాపు 110 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థకు గురైతే విద్యాశాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి నుంచి కనీస స్పందన లేకపోవడం దురదృష్టకరమన్నారు.

రాష్ట్రంలో కేజీబీవీలు, గురుకులాలు, సంక్షేమ హాస్టల్స్‌లో ఫుడ్ పాయిజనింగ్ సంఘటనలు, విద్యార్థుల మరణాలపై హైకోర్టు సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన కామన్ మెనూ పథకాన్ని అన్ని విద్యా సంస్థల్లో సమర్థవంతంగా అమలు చేయాలని ఆయన కోరారు. దాదాపు గంట పాటు ఏబీవీపీ నాయకుల ఆందోళన కొనసాగడంతో పోలీసులు వారికి నచ్చజెప్పి ఆందోళన విరమింప జేసే ప్రయత్నం చేశారు. కానీ వారు ఆందోళన ఉధృతం చేశారు. దీంతో పోలీసులు వారందరిని అరెస్టు చేసి బలవంతంగా లాక్కెళ్లి వాహనంలో స్టేషన్‌కు తరలించారు. తదనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరేష్‌తేజ, రాష్ట్ర కార్య సమితి సభ్యులు సౌమ్య, అర్జున్, జిల్లా కన్వీనర్ శివశంకర్, నాయకులు శంతన్, బంగారుబాబు, ప్రశాంత్, వంశీ, అనిల్, సాయి, భరత్, మల్లేష్‌యాదవ్, ప్రసాద్‌కుమార్, భాను, కీర్తన, కృష్ణవేణి, గాయత్రి, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ భవిష్యత్తు రోడెక్కింది

- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి, జూలై 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తెలంగాణ భవిష్యత్తు రోడెక్కిందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో విమర్శించారు. బుధవారం గద్వాల జిల్లాలోని పుల్లూరు గురుకుల పాఠశాల విద్యార్థుల సమస్యలపై ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఆయన మాట్లాడుతూ నాడు కేసీఆర్ పాలనలో గురుకుల విద్యార్థులు ఎవరెస్ట్ శిఖరాలు ఎక్కారనీ అన్నారు. నేడు ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో తమ సమస్యల పరిష్కారం కోసం గురుకుల పాఠశాలల విద్యార్థులు రోడెక్కుతున్నారని మండిపడ్డారు. పుల్లూరు మహాత్మా గాంధీ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో తాగు నీరు రాక ఉప్పు నీరు తాగుతున్నామని, పురుగుల అన్నం తింటున్నామని, మరుగుదొడ్లు సరిగ్గా లేక బహిర్భూమికి పంట పొలాల్లోకి వెళ్తున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తూ.. కలెక్టరేట్ ముట్టడికి బయలుదేరడం కాంగ్రెస్ పాలన వైఫల్యానికి నిదర్శనం విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం బడిపిల్లల పాదయాత్రను కూడా బెదిరించి విద్యార్థులను డీసీఎంలో ఎక్కించి వెనక్కి తీసుకెళ్లడం కాంగ్రెస్ సర్కార్ నిర్బంధానికి నిదర్శనం ఆవేదన వ్యక్తం చేశారు. సంక్షేమ గురుకుల పాఠశాల నిర్వహణను ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడలో గురుకుల విద్యార్థులు 150 మంది కలుషిత ఆహారం తిని ఆసుపత్రి పాలైన ఘటన మరవక ముందే పుల్లూరు విద్యార్థులు రోడెక్కడం ఈ ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనన్నారు. సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

బీటీ రోడ్డును త్వరితగతిన పూర్తి చేయాలి

వెల్దండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మినోనిపల్లి నుంచి దొంగరోడ్డు వరకు ఏర్పాటు చేస్తున్న బీటీరోడ్డును త్వరితగతిన పూర్తిచేయాలని బుధవారం బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కంకరపరిచిన రోడ్డుపై నిలబడి నిరసన వ్యక్తంచేశారు. నిర్మాణ పనుల్లో జాప్యం చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని, కంకర రోడ్డుపై గుంతలు ఏర్పడటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. నాయకులు గండికోట రాజు, యాదవరెడ్డి, శేఖర్, సత్యం, వెంకటేష్, యాదగిరి, భాస్కర్, హర్షగౌడ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

చికిత్స పొందుతూ బాలిక మృతి

మానవపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తే.. వద్దని పెళ్లి సంబంధాలు చూస్తున్నారని మనస్తాపంతో పురుగుల మందుతాగి మైనర్ బాలిక ఆత్మహత్య చేసుకున్న ఘటన జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలోని గోకులపాడు గ్రామంలో చోటు చేసుకుంది. ఈ సంఘటనపై ఎస్ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏపీలోని కర్నూల్ జిల్లా రేమట గ్రామానికి చెందిన ఎర్రల గిరిబాబు కూతురు(17), ఏడవ తరగతి వరకు చదువుకుని బడికి వెళ్లలేదు. గ్రామంలోనే యువకుడితో ప్రేమ వ్యవహారం జరపడంతో మైనర్ బాలికను తన అక్క గ్రామమైన గోకులపాడు గ్రామానికి తీసుకువచ్చి పెట్టారు. ఈ క్రమంలో 18 సంవత్సరాలు నిండిన తరువాత పెళ్లి చేయాలని సంబంధాలు చూస్తున్నారు.

ఈ క్రమంలో బాలిక తను ప్రేమిస్తే తప్పు అని చెప్పినవారు పెళ్లి సంబంధాలు చూస్తున్నారని మనస్తాపంతో ఈ నెల 28వ తేదీన ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగుల మందు తాగింది. విషయం గమనించిన ఇరుగుపొరుగువారు చికిత్స నిమిత్తం కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం బాలిక మృతి చెందినట్లు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని అన్నారు.

కొర్రతండాలో భూమి పంపకాలపై కొట్లాట

అచ్చంపేట రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): అచ్చంపేట మండలం కొర్రతండా గ్రామంలో అన్నదమ్ములైన కొర్ర రాంలాల్, కొర్ర విజయ్‌కు మధ్య కొన్ని సంవత్సరాలుగా భూమి పంపకాల విషయంలో గొడవలు జరుగుతున్నాయి. బుధవారం సాయంత్రం తమ్ముడు కొర్ర విజయ్ అన్న కొర్ర రాంలాల్ ఇంటికి వెళ్లి కొర్ర లచ్చయ్య కొర్ర కిసాన్, కొర్ర దేవి అనే వ్యక్తులతో కలిసి కొర్ర రాంలాల్‌ను కర్రలతో దాడి చేశారు. రాంలాల్ తలకు, ఒంటిపై గాయాలయ్యాయి. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సిద్దాపూర్ ఏఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వనమహోత్సవాన్ని పకడ్బందీగా చేపట్టాలి

చారకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో వనమహోత్సవ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టి మొక్కల సంరక్షణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డీ ఆర్డీవో చిన్న ఓబులేసు అన్నారు. బుధవారం మండలంలోని జూపల్లి గ్రామంలో నర్సరీ, కమ్యూనిటీ ప్లాంటేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 15 వరకు వనమహోత్సవ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని అన్నారు. అనంతరం పోస్టాఫీస్, ప్రాథమిక ఉప కేంద్రాన్ని సందర్శించి చిన్న పిల్లలకు వేస్తున్న వ్యాక్సిన్‌ను పరిశీలించారు. గతంలో వేలిముద్ర ద్వారా పింఛన్ పొందే వృద్ధులకు మరింత సులభతరంగా ఐరిస్ ద్వారా పింఛన్లను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీపీఎం శ్రీనివాసులు, ఏపీవో లక్ష్మయ్య, వైద్యురాలు ప్రియాంక, బీపీఎం దేవేందర్, టీఏ యాదయ్య, ఎఫ్ఏ యాదయ్య పాల్గొన్నారు.

పీజీ పరీక్ష ఫలితాలు విడుదల



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న పీయూ వీసి ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్ బాబు

పాలమూరు యూనివర్సిటీ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీ పరిధిలోని ఫార్మసీ, ఇంటిగ్రేటెడ్ బీఈడీ, ఎంఈడీ పరీక్ష ఫలితాలను బుధవారం పరిపాలన భవనంలోని వీసీ చాంబర్ పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పూస రమేష్ బాబులతో కలిసి విడుదల చేశారు. ఫార్మసీలో 100 శాతం, ఇంటిగ్రేటెడ్ బీఈడీ రెండవ సెమిస్టర్‌లో 30.28 శాతం, నాల్గవ సెమిస్టర్‌లో 33.64 శాతం, ఆరవ సెమిస్టర్‌లో 65.91 శాతం, ఎంఈడి మొదటి సెమిస్టర్‌లో 73.33 శాతం, మూడవ సెమిస్టర్‌లో 52.58 శాతం ఉత్తీర్ణత సాధించారని పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ప్రవీణ తెలిపారు. ఫలితాలను అధికారిక వెబ్ సైట్‌లో చూసుకోవాలని, అభ్యాంతరాలు ఉంటే రివాల్యుయేషన్ చేసుకోవాలని అన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవికాంత్, డాక్టర్ కరుణాకర్ రెడ్డి, ఎగ్జామినేషన్ కోఆర్డినేటర్స్ డాక్టర్ సురేష్, డాక్టర్ ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పీఏసీఎస్ సొసైటీని సందర్శించిన నాబార్డు



పీఏసీఎస్‌లో రికార్డులను పరిశీలిస్తున్న నాబార్డు సభ్యులు

ఉప్పునుంతల, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతలలో ని పీఏసీఎస్ సొసైటీని బుధవారం నాబార్డు అధికారులు ఏజీఎం శ్రీనివాస్‌రావు, డీసీసీబీ ఏజీఎం దయాకర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, మేనేజర్ రవికుమార్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా గత ఆర్థిక సంవత్సరం మార్చి 30 2025 నాటికి జరిపిన లావాదేవీలు రికార్డులను వారు పరిశీలించారు. పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ భూపాల్ రావు, సీఈవో రవీందర్‌రావు తదతరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద ఉధృతి

» ప్రాజెక్టు సైట్ వద్ద 3.06 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు

» ఎనిమిది గేట్ల ద్వారా 2.16 లక్షల క్యూసెక్కులు విడుదల

» విద్యుదుత్పత్తి ద్వారా మరో 65 వేల క్యూసెక్కులు దిగువకు..

» జూరాలకు 1.78 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1.79 లక్షల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో

» తుంగభద్రకు 90 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 94 వేల క్యూసెక్కుల ఔట్‌ఫ్లో

మహబూబ్‌నగర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : శ్రీశైలం ప్రాజెక్టు వరద ఉధృతి కొనసాగుతోంది. బుధవారం ప్రాజెక్టు సైట్ వద్ద 3.06 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా ఎనిమిది గేట్లు ఎత్తి 2.16 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. విద్యుదుత్పత్తి, పోతిరెడ్డిపాడు, హంద్రీనీవా, ఎంజీకేఎల్ఐతో కలుపుకొని ప్రాజెక్టు నుంచి 3.17 లక్షల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు కాగా ప్రస్తుతం 202.96 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఆలమట్టి రిజర్వాయర్‌కు 1.51 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 1.38 లక్షల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. నారాయణపూర్‌కు 1.43 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా 1.47 లక్షల క్యూసెక్కులను జూరాలకు వదులుతున్నారు. జూరాల వద్ద 1.78 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా 1.79 లక్షల క్యూసెక్కులను వదులుతున్నారు. తుంగభద్ర వద్ద 90 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా 94 వేల క్యూసెక్కులను శ్రీశైలంవైపు వదులుతున్నారు. అటు జూరాల, ఇటు తుంగభద్ర నుంచి వస్తున్న వరదతో శ్రీశైలం వద్ద 3.06 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది.

ప్రయాణికులను తరలిస్తున్న గూడ్స్ వాహనాలను పట్టుకున్న పోలీసులు



పట్టుకున్న వాహనాల యజమానులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్.ఐ

మద్దూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి):నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను తరలిస్తున్న మూడు బొలెరో వాహనాలను మద్దూర్ పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఎస్ఐ విజయ్‌కుమార్ వివరాల ప్రకారం.. వాహనాల ఆకస్మిక తనఖీలు నిర్వహిస్తున్న క్రమంలో కూలీలను, చిన్న పిల్లలను తరలిస్తున్న మూడు గూడ్స్ వాహనాలను గుర్తించినట్లు, ఇట్టి వాహనాలను స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించి జరిమానా విధించడంతో పాటు వాహన యజమానులకు కౌన్సెలింగ్ ఇచ్చామని ఎస్ఐ తెలిపారు.

వైన్‌షాప్‌లో చోరీ

మక్తల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మక్తల్ పట్టణంలోని నారాయణపేట రహదారిలో తాళం వేసి ఉన్న ఓ వైన్‌షాప్‌లో రూ. 3.85లక్షల నగదు చోరీ చేసిన సంఘటన బుధవారం తెల్లవారుజా మున చోటు చేసుకుంది. ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన రఘునాథ్‌రెడ్డి నారాయణపేట రోడ్డువైపు వైన్‌షాప్ నిర్వహిస్తున్నాడు. ఎప్పటిలాగే బుధవారం ఉదయం వైన్‌షాప్‌నకు వెళ్లి చూడగా అప్పటికే తాళం విరగ్గొట్టి ఉంది. కౌంటర్‌లో ఉన్న రూ.3.85లక్షలు చోరీ అయ్యాయి. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ పుటేజీని పరిశీలించగా పక్క షట్టర్ ను యంత్రాలతో కట్‌చేసి అక్కడి నుంచి దుకాణంలోకి వెళ్లినట్లు అగుపించింది. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై భాగ్యల క్ష్మీరెడ్డి తెలిపారు. ఓ వైపు నిఘాను పటిష్టం చేస్తున్నామని పోలీసులు చెబుతున్నా దొంగతనాలకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు.

అంబులెన్సులో తరలిస్తుండగా రైతు మృతి

» ఆక్సిజన్ లేకనే చనిపోయాడంటూ బంధువుల ఆరోపణ

» ఈఎంటీ మహిళపై దాడిచేసి కప్పిపుచ్చుకునేందుకే ఆరోపణలు

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం), జూలై 30 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో అంబులెన్స్‌లో వెళితే ఆక్సిజ న్ అందక చనిపోయాడంటూ మృతుడి బంధువులు ఆందోళన చేసిన సంఘటన జిల్లాకేంద్రంలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకా రం.. మూసాపేట మండలం నిజలాపూర్ గ్రామానికి చెందిన భోజయ్య అనే రైతుకు తీవ్ర అనారోగ్యం కావడంతో బుధవారం స్థానిక పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు జనరల్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని చెప్పడంతో వారు 108 అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. అయితే ఎస్వీఎస్ ఆసుపత్రికి వచ్చేలోగా మార్గమధ్యంలో ఆ రైతు చనిపోయాడు. అదే ఆసుపత్రి ఎదుట అంబులెన్స్ ఆపి మృతుడి బంధువులు ఆందోళన చేశారు. అంబులెన్స్‌లో ఆక్సిజన్ లేకపోవడం వల్లనే తమ తండ్రి చనిపోయాడని కొడుకు ఆరోపించాడు.

దీనిపై 108 అంబులెన్స్ జిల్లా కోఆర్డినేటర్ రవిని వివరణ కోరగా.. మృతుడి బంధువులు ఆక్సిజన్ పెట్టే క్రమంలో తమ సిబ్బంది ఈఎంటీ(మహిళ)పై దాడి చేశారని, దుర్భాషలాడుతూ పైలెట్‌పై కూడా విరుచుకుపడ్డారని తెలిపారు. అంతే కాకుండా నాకు కూడా ఫోన్ చేసి దురుసుగా మాట్లాడారని, అవన్నీ కప్పిపుచ్చేందుకు ఆక్సిజన్ లేదని ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆక్సిజన్ లేకుండా ఒక్క వాహనం కూడా లేదని, ఈ వాహనంలో కూడా సరిపోయినంత ఆక్సిజన్ ఉందని తెలిపారు. తమ సిబ్బందిపై జరిగిన దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు.

క్రైం కార్నర్

భార్య పుట్టింటి నుంచి రాలేదని భర్త ఆత్మహత్య

వనపర్తి రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదని భర్త ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన వనపర్తి పట్టణ కేంద్రంలోని సాగర్ కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... సాగర్ కాలనీకి చెందిన నరేష్‌కు ఎనిమిది సంవత్సరాల కిందట శిరీషతో వివాహం అయింది. పేయింటర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. గత కొన్ని రోజుల కిందట భర్త నరేష్ సాగర్ రోజు మద్యం తాగి వస్తున్నాడని, భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవతో ఆమె పుట్టింటికి వెళ్లి తిరిగి రాలేదు. భార్య పుట్టింటి నుంచి తిరిగి రాలేదని, మద్యం తాగిన మత్తులో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మృతి చెందాడని స్థానికులు తెలిపారు.

లారీ బోల్తా.. డ్రైవర్‌కు గాయాలు



లారీ డ్రైవర్‌ను బయటకు తీయడం కోసం క్యాబిన్‌ను తొలగిస్తున్న పోలీసులు

కొత్తకోట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై లారీ బోల్తా పడి డ్రైవర్‌కు గాయాలైన సంఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో బుధవారం చోటుచేసుకున్నది. కర్ణాటక రాష్ట్రం నుంచి టమాటా లోడుతో హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ పాలెం గ్రామ శివారులో అదుపుతప్పి రోడ్డు కిందకు బోల్తా పడింది. లారీలో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు వ్యక్తులు ఉండగా, డ్రైవర్ అమీర్ క్యాబిన్‌లో చిక్కుకపోయాడు. జేసీబీ వాహనంతో క్యాబిన్‌ను తొలగించి గాయపడిన అమీర్‌ను చికిత్స నిమిత్తం 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

కూతురిపై అత్యాచారం చేసిన తండ్రికి రిమాండ్

మరికల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా మరికల్ మండలం పూసల్‌పహాడ్ గ్రామంలో ఈనెల 25న కన్న కూతురుపై అఘాయిత్యానికి పాల్పడిన తండ్రిని పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నా రు. మూడు బృందాలుగా పోలీసులు గాలింపు చర్యలు చేపట్టి బుధవారం పట్టుకొని జిల్లా కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రాములు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మరో ముగ్గురు నిందితుల కస్టడీ కోసం పిటిషన్

- ఇన్వెస్టిగేషన్ అధికారి టంగుటూరి శ్రీను

గద్వాల క్రైం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సర్వేయర్ హత్య కేసులో నిందితులుగా ఉన్న మరో ముగ్గురిని కస్టడీలోకి తీసుకొని విచారించేందుకు కోర్టు అనుమతికై బుధవారం పిటిషన్ దాఖలు చేస్తున్నట్లు ఇన్వెస్టిగేషన్ అధికారి, సీఐ టంగుటూరి శ్రీను తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాలలో సంచలనం రేపిన సర్వేయర్ హత్య కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న ఎనిమిది మందిలో ఈ నెల 10న ఏ1. తిరుమల్‌రావు, ఏ3. నాగేష్, ఏ4. పరుశురామ్, ఏ5. రాజులను నాలుగురోజుల పాటు కస్టడీలోకి తీసుకొని విచారించారు.

అలాగే ఈ నెల 25న మళ్లీ ఏ1. తిరుమల్‌రావు, ఏ2. ఐశ్వర్యలను మూడు రోజుల పాటు కస్టడీలోకి తీసుకొని హత్యకు సంబంధించి వివరాలను సేకరించారు. అలాగే మిగిలిన ఏ6. మోహన్, ఏ7. తిరుపతయ్య(తిరుమల్‌రావు తండ్రి) ఏ8. సుజాత (ఐశ్వర్య తల్లి)లను కస్టడీలోకి తీసుకొని విచారించేందుకు కోర్టుకు పిటిషన్ దాఖలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇక వీరు ముగ్గురిని కస్టడీలోకి తీసుకొని విచారిస్తే తేజేశ్వర్ హత్యకు సంబంధించిన పూర్తి విషయాలు తెలిసే అవకాశాలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. వీటితో పాటు హత్యకు సంబంధించి మరికొన్ని నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

పిచ్చికుక్క కరిచి ఆరుగురికి తీవ్ర గాయాలు

- ఏడేళ్ల బాలుడి పరిస్థితి విషమం
- జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స



వట్టెంలో పిచ్చికుక్క కరిచి గాయపడిన మహిళ

బిజినేపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని వట్టెంలో బుధవారం పిచ్చికుక్క ఆరుగురిపై దాడి చేసి కరవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఏడేండ్ల బాలుడి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. కొన్నిరోజులుగా పిచ్చికుక్క గ్రామంలోని వీధుల వెంట తిరుగుతుండటంతో గ్రామ పంచాయతీ అధికారులకు తెలిపినా పట్టించుకోకపోవడంతోనే ఆరుగురిపై దాడి చేసిందని అవేదన వ్యక్తం చేశారు. పిచ్చికుక్క కరిచి గాయపడిన వారిలో గ్రామానికి చెందిన బంగారమ్మ, సరిత, శివ, ఏడేండ్ల బాలుడు, మరో ఇద్దరు ఉన్నారు. వారందరిని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స అందించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండడంతో జిల్లా ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆ పిచ్చికుక్కను గ్రామస్థులు కొట్టి చంపినట్లు తెలుస్తోంది.

కారు ఢీకొని ఆవు మృతి

ఊర్కొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఆవు మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండల కేంద్రంలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై పెట్రోల్ బంక్ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. ఊర్కొండకు చెందిన బాధిత రైతు ఆకుల నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి కోసం పాడి ఆవుల పోషణ చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. రోజువారీగా బుధవారం ఆవులను పొలంలో మేపేందుకు తీసుకొని వెళుతుండగా జాతీయ రహదారి దాటుతున్న క్రమంలో కారు వేగంగా వచ్చి ఆవును ఢీ కొట్టడంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందిందని అన్నారు. ఆవు మృతిపై ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ కృష్ణదేవ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



తీవ్రంగా గాయపడ్డ శంకర్

చారకొండ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో స్కూటీ అదుపు తప్పి కిందపడటంతో ఇద్దరికి గాయాలు అయిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలో బధవారం చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా దేవరకొండకు చెందిన నరేష్, శంకర్ ఇద్దరు స్కూటీపై కల్వకుర్తి నుంచి దేవరకొండకు వెళ్తున్నారు. మండలంలోని జూపల్లి సమీపంలో జడ్చర్ల- కోదాడ జాతీయ రహదారిపై స్కూటీ అదుపు తప్పి కిందపడటంతో శంకర్‌కు కుడి చేయి విరిగింది. నరేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో అంబులెన్సులో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ శంషుద్దీన్ తెలిపారు.

విద్యాభివృద్ధి దిశగా..

- ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ బోధన
- ఎల్‌కేజీ, యూకేజీ అడ్మిషన్లు ప్రారంభం
- ప్రతీ పాఠశాలలో వసతుల కల్పనకు రూ.లక్ష యాభై వేల నిధులు
- ఆగస్టు 15 లోపు పాఠశాలలు ప్రారంభించేందుకు చర్యలు
- ఉమ్మడి జిల్లాలో 94 పాఠశాలలు



మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 30 (ఆంధ్రజ్యోతి): సర్కారు బడులను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా బలోపేతం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచే దిశగా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నది. అందులో భాగంగానే 2025 - 2026 విద్యా సంవత్సరంలోనే రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో ప్రీ ప్రైమరీ బోధన ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు సంబంధించి ఉమ్మడి పాలమూరు జిల్లాలో 94 పాఠశాలలను ఎంపిక చేస్తూ ఈనెల 26న పాఠశాల విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. పాఠశాలల్లో తరగతుల నిర్వహణ విద్యార్థులకు ఆట వస్తువులు తదితర సామగ్రి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం రూ.33.01 లక్షల బడ్జెట్ కేటాయించింది. ఇందులో మొదటి విడతగా రూ.22.62 లక్షలు మంజూరు చేసింది. ప్రతి పాఠశాలకు తాత్కాలిక పద్ధతిలో ఉపాధ్యాయులను, ఆయాలను నియమించనున్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి నూతనంగా ప్రారంభించిన పాఠశాలల్లో 4 ఏళ్ల నుంచి 5 ఏళ్ల పిల్లలను ఈ పాఠశాలల్లో చేర్పించనున్నారు.

పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ అడ్మిషన్స్

ఎంపికైన ప్రతీ పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు కొనసాగిస్తారు. పాఠశాలలు విద్యార్థులను అకట్టుకునే విధంగా ప్రత్యేక అలంకణ చేయనున్నారు. పిల్లలు ఆకట్టుకునేలా గోడలకు బొమ్మలు, అక్షర ఆకారాలు తీర్చిదిద్ది చిన్నారులకు అవసరమైన ఫర్నీచర్ సమకూర్చనున్నారు. విద్యార్థులు ఆడుకునేందుకు ఇండోర్ గేమ్స్, అవుట్‌డోర్ గేమ్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల సహకారం తీసుకోనున్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పర్యవేక్షణలోనే ఈ పాఠశాలలు కొనసాగనున్నాయి. ప్రతి పాఠశాలకు మొదటి విడతలో రూ. లక్షా యాభై వేలు మంజూరయ్యాయి.

జిల్లాల వారీగా ఎంపికైన పాఠశాలలు ఇలా..

జిల్లా పేరు	ప్రీ ప్రైమరీ పాఠశాలలు
మహబూబ్‌నగర్	26
వనపర్తి	16
జోగుళాంబ గద్వాల	19
నారాయణ పేట	12
నాగర్‌కర్నూల్	21

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, స్నాక్స్

ప్రీ ప్రైమరీ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు అంగన్‌వాడీలలో ఇచ్చే స్నాక్స్ కూడా అందించనున్నారు. ఈ పిల్లలకు అందించాల్సిన భోజనం, స్నాక్స్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, అంగన్‌వాడీ కార్యకర్తలు పర్యవేక్షించనున్నారు. పిల్లల ఎంపిక పాఠశాల స్థాయిలో జరగనుంది

అన్ని శాఖల సమన్వయంతో..

ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసే ప్రీ ప్రైమరీ పాఠశాల తరగతుల నిర్వహణకు సంబంధించి అన్ని శాఖలను సమన్వయం చేయనున్నారు. విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, మహిళాభివృద్ధి, వైద్య ఆర్యోగ శాఖ, కుటుంబ సంక్షేమ శాఖలకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. ఈ పాఠశాల నిర్వహణ మండల , జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారులు పర్యవేక్షిస్తారు. ఇందుకు సంబంధించి ప్రతీ పాఠశాలకు ఇద్దరు చొప్పున సిబ్బందిని నియమించనున్నారు. ఒక టీచర్ ఇంటర్మీడియట్, ఆపైన అర్హత ఉన్నవారు, విద్యార్థుల బాగోగులు చూసుకునేందుకు ఒక ఆయాను కూడా నియమిస్తారు. ఆయా పని చేసే వారు కనీసం 7 వ తరగతి చదివి ఉండి, స్థానికులై ఉండాలన్న నిబంధనలు పెట్టారు. వీరిని జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో ఉన్న కమిటీలు ఎంపిక చేయనున్నాయి. ప్రీ ప్రైమరీ విద్యార్థులకు ఎన్‌సీఆర్‌టీ జాతీయ స్థాయి సిలబస్ బోధించేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

సుంకేసులకు పోటెత్తిన వరద

రాజోలి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రాజోలి శివారులోని సుంకేసుల జలాశయానికి బుధవారం వరద పోటెత్తింది. కర్ణాటక రాష్ట్రంలోని టీబీ డ్యాం (తుంగభద్ర డ్యాం) నుంచి విడుదల చేసిన వరద నీరు సుంకేసుల డ్యాంకు చేరుతున్నది. దీంతో సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి 1.25 లక్షల క్యూసెక్కుల నీరు వస్తుండటంతో జలాశయం నందు 10 గేట్లు 1 మీటరు, 11 గేట్లు 2 మీటర్లు, మొత్తం 21 గేట్లు తెరిచి దిగువకు 1.24 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు డ్యాం అధికారి మద్దిలేటి స్వామి తెలిపారు. డ్యాంకు వరద ప్రవాహం మరింత పెరిగే అవకాశం ఉందని, మత్స్యకారులు నదిలోకి దిగకూడదని హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం సాయంత్రం డ్యాంను పరిశీలించి, అక్కడి పరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు..

వివాహిత అదృశ్యం

ఊట్కూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలోని చిన్నపొర్ల గ్రామానికి చెందిన ఆకుల మహేశ్వరీ (26) అనే వివాహిత కనిపించడం లేదని భర్త ఆకుల రాంనరేష్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. చిన్నపొర్ల గ్రామానికి చెందిన ఆకుల హన్మంతు కుమారుడైన ఆకుల రాంనరేష్‌తో నర్వ మండలం చిత్తనూర్ గ్రామానికి చెందిన మహేశ్వరితో ఆరు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి సంతానం కలగకపోవడంతో భార్యాభర్తల మధ్యన తరచుగా గొడవలు జరిగేవి. అయితే మంగళవారం రోజు పుట్టింటికి వెళుతున్నామని, ఇంటి నుంచి వెళ్లిపోయిన మహేశ్వరి, అటు తల్లిదండ్రుల ఇంటికి సైతం చేరకపోవడంతో భర్త బంధువులు, తెలిసిన వాళ్లతో ఫోన్లు చేసినా రాలేదని చెప్పడంతో భర్త బుధవారం ఊట్కూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమేష్ తెలిపారు.

హెచ్‌సీఏ 2లీగ్‌లో మహబూబ్‌నగర్ గెలుపు

- 160 పరుగుల తేడాతో విజయం
- 5 వికెట్లు తీసి చెలరేగిన ముఖీద్



గెలిచిన ఉమ్మడి మహబూబ్‌నగర్ జట్టుతో ఎండీసీఏ సెక్రటరీ రాజశేఖర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) 2లీగ్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు 160 పరుగుల తేడాతో గెలిచింది. మొదటి రోజు బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు మొదటి ఇన్నింగ్‌లో 85.1 ఓవర్లలో 300 పరుగులకు అలౌట్ అయ్యింది. బుధవారం హైదరాబాద్‌లోని త్యాగీ క్రికెట్ మైదానంలో బ్యాటింగ్ దిగిన వెస్ట్‌మారెడ్‌పల్లి జట్టు 56.4 ఓవర్లలో 139 పరుగలకు కూప్పకూలింది. జట్టులో రమేష్ 33, చరణ్‌తేజ 47 పరుగులు చేశారు. జిల్లా బౌలర్లలో ముఖీద్ 5 వికెట్ల తీసి చెలరేగాడు. జయంత్ 3, జయసింహా ఒక వికెట్ తీసి జట్టు విజయానికి కృషి చేశారు. జిల్లా జట్టు విజయం సాధించడం పట్ల జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎం. రాజశేఖర్ కోచ్ అబ్దుల్లా, జట్టు క్రీడాకారులను అభినందించారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

- డీవైఎస్‌వో శ్రీనివాస్
- ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక



షటిల్‌బ్యాడ్మింటన్ విజేతలతో డీవైఎస్‌వో శ్రీనివాస్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని డీవైఎస్‌వో శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా అండర్-11 బాల,బాలికల విభాగాల్లో జిల్లా స్థాయి జట్ల ఎంపికలను బుధవారం నగరంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. డీవైఎస్‌వో శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్తింపు ఉన్న క్రీడలను ఎంపిక చేసుకుంటేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు విజేతగా నిలువాలని ఆకాంక్షించారు. జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రధాన కార్యదర్శి ఎల్. రవికుమార్ మాట్లాడుతూ జిల్లా స్థాయి టోర్నీ కమ్ సెలక్షన్స్ నిర్వహించామని, విజేతలకు బహుమతులు ప్రదానం చేశామని తెలిపారు. కార్యక్రమంలో కోచ్ గోపాల్, సీనియర్ క్రీడాకారుడు సయ్యద్, డీఎస్ఏ కోచ్‌లు సునీల్, పర్వేజ్ పాల్గొన్నారు.

విజేతల వివరాలు...

సింగిల్స్ బాలుర విభాగం...: ఆర్విన్‌భాస్కర్ (విజేత), విహాన్ (రన్నర్)

డబుల్స్ విభాగంలో...: విహాన్ - విశ్వతేజ (విజేత)

సింగిల్స్ బాలికల విభాగంలో...: శిరీష (విజేత), లాస్యశ్రీ (రన్నర్)

డబుల్స్ విభాగంలో....: ఆద్యా- అనూశ్రీ(విజేత)

కోస్గి ఇంజనీరింగ్ కళాశాలకు ఏడాది

- ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో మంజూరు
- నూతన హంగులతో ప్రారంభమైన భవన నిర్మాణ పనులు



ప్రస్తుత ఇంజనీరింగ్ కళాశాల భవనం

కోస్గి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కోస్గి ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభమై ఏడాది పూర్తి చేసుకున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో సొంత నియోజకవర్గం కొడంగల్‌లో ఏర్పాటైంది. ఇక్కడున్న పాలిటెక్నిక్ కళాశాలకు అనుసంధానంగా ఇంజనీరింగ్ కళాశాల రావడంతో గత ఏడాది మొదటి సంవ త్సరం పూర్తయింది. ఈ కళాశాలలో సీఎస్‌ఈ, సీఎస్‌ఎం, సీఎస్‌డీ కోర్సులు ఉన్నాయి గత సంవత్సరం పాలిటెక్నిక్ కళాశాలలోనే ఇంజనీరింగ్ కొనసాగించారు. ప్రస్తుతం 8మంది అధ్యాపకులు డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారు. ల్యాబ్ సౌకర్యం, అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నారు. 10 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటా యించి నూతన ఇంజనీరింగ్ కళాశాల భవనానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు కొడంగల్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి భూమిపూజ చేశారు. సుమారు 20 లక్షల రూపాయలతో ప్రస్తుతానికి కళాశాల భవన నిర్మాణం చేపడుతున్నారు. మంగళవారం నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్ కళాశాల భవన నిర్మాణ పనులు పరిశీలించారు.

త్వరలో హాస్టల్ భవన నిర్మాణానికి సైతం నిధులు మంజూరు కానున్నాయని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది కూడా ఇక్కడున్న కోర్సులలో కౌన్సెలింగ్ ద్వారా విద్యార్థులు అడ్మిషన్ పొందుతున్నారు. ఇప్పటికే రెండు కౌన్సెలింగ్‌లు పూర్తయ్యాయి. వచ్చేనెల 5వ తేదీ నుంచి మూడవ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది.

సిబ్బంది కొరత ఉంది

మా దగ్గర ప్రస్తుతానికి నాతో కలిపి 8మంది అధ్యాపకులం డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నాం. 57 మంది టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది అవసరం ఉంది ప్రభుత్వానికి నివేదిక పంపాం. గత సంవత్సరం నుంచి మూడు కోర్సులు ఇక్కడ నడుస్తున్నాయి. ఒక్కో కోర్సులో 66 సీట్లు ఉంటాయి. మొత్తం 198 సీట్లకు గాను గత సంవత్సరం 131 మందిని కౌన్సెలింగ్‌లో అలర్ట్ చేశారు. మొదటి సంవత్సరం కనుక అంతగా ఎవరికీ కళాశాల గురించి తెలియలేదు ఈ ఏడాది కౌన్సెలింగ్‌లో చాలామంది ఆప్షన్ పెట్టుకుంటున్నారు. మొత్తం సీట్లు భర్తీ అయ్యే అవకాశం ఉంది.



- శ్రీనివాస్, ప్రిన్సిపాల్, ఇంజనీరింగ్ కళాశాల

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



సాయికిరణ్

చిన్నచింతకుంట, జూలై 30 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అల్లిపూర్ గ్రామానికి చెందిన సుచిత్ర, సాయికిరణ్‌లు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 29న మంగళవారం నిర్వహించిన వనపర్తి జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో సుచిత్ర సబ్ జూనియర్ గర్ల్స్ విభాగంలో 60 మీటర్ల పరుగు పందెంలో, బ్రాడ్ జంప్‌లో పాల్గొని మొదటి స్థానాలలో గెలుపొంది 2 బంగారు పతకాలు సాధించి, రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించింది. అలాగే సాయికిరణ్ జూనియర్ బాయ్స్ విభాగంలో బ్రాడ్ జంప్‌లో పాల్గొని మొదటి స్థానంలో నిలిచాడు. బంగారు పతకం సాధించాడు. కాగా ఆగస్టు 7న జనగాం జిల్లాలోని ధర్మకాంచ స్టేడియంలో జరగబోయే 4వ జావెలెన్ డే సెలెబ్రేషన్స్, కిడ్స్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొననున్నారని వనపర్తి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నందిమల్ల శ్రీకాంత్, అథ్లెటిక్స్ కోచ్ నవీన్ తెలిపారు. గ్రామీణ స్థాయి నుంచి క్రీడల్లో రాణించి రాష్ట్రస్థాయిలో రాణించడంపై తల్లిదండ్రులు, గ్రామస్థులు, పలువురు క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

గుప్త నిధుల కోసం వస్తున్నారని..

ఇద్దరిని పట్టుకున్న గ్రామస్థులు

- ఆలయ పూజారికి ఫోన్‌లో బెదిరింపులు
- పోలీసులకు అప్పగింత



ఇద్దరిని అదుపులోకి తీసుకొని, గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ మురళి

మానవపాడు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తులు తరచూ ఆలయం చుట్టూ చక్కర్లు కొడుతూ పూజారితో ఫోన్‌లో గుడి దగ్గరే ఎక్కువ సమయం కేటాయిస్తున్నవని బెదిరిస్తూ.. సీసీ కెమెరాలపై ఆరా తీయడంపై గ్రామస్థులు అనుమానం వ్యక్తం చేశారు. ఆ ఇద్దరిపై నిఘా ఉంచి గ్రామస్థులు బుధవారం పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన మండలంలోని బోరవెల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఈ ఘటనపై గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల రోజుల నుంచి ఇద్దరు వ్యక్తులు గ్రామంలోని పురాతన చరిత్ర గల చెన్నకేశవ స్వామి ఆలయంలో గుప్త నిధులు ఉన్నాయని తిరుగుతున్నారు. గతంలో దేవాలయానికి వేసిన తాళం పగులగొట్టి గర్భగుడిలోకి ప్రవేశించారు. ఈ ఘటనపై కోదండపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

ఈ క్రమంలో బుధవారం ఉండవల్లి మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అనుమానంగా తిరుగుతూ గుడి దగ్గరికి వచ్చారు. ఈ క్రమంలో పూజారితో మాట్లాడుతుండగా, గ్రామస్థులు అక్కడికి చేరుకుని ఇద్దరిని పట్టుకున్నారు. గ్రామంలో ఎందుకు తిరుగుతున్నారంటూ ప్రశ్నించారు. ఇద్దరికి సంబధించిన ఓ వ్యక్తి నాగర్ కర్నూల్‌లో ఉన్నారని ఆయనకు ఆలయం చుట్టూ పక్కన ఉన్న విషయాలపై సమాచారం ఇస్తున్నారని, ఆ వ్యక్తిని పిలిపించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తులు వివిధ వార్తా పత్రికల్లో పనులు చేస్తున్నట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న కోదండపూర్ ఎస్‌ఐ మురళి గ్రామానికి చేరుకుని ఆ ఇద్దరి వ్యక్తులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ఆలయ విషయంపై విచారించి తదుపరి విషయాలు వెల్లడిస్తామని ఎస్‌ఐ మురళి తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

మొక్కలు నాటి సంరక్షించాలి

● ఇన్‌చార్జి ఏపీవో మహమ్మద్ గౌస్



కృష్ణ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని ఏపీవో మహమ్మద్‌గౌస్ తెలిపారు. బుధవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు.

మండలంలోని ఎన్ని గ్రామ పంచాయతీల్లోని నర్సరీలో మొక్కలు పెంచుతున్నారు?

మండలానికి 60వేల మొక్కలు లక్ష్యంగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి. ఆరు నర్సరీల్లో 10 వేల మొక్కలు పెంచుతున్నాం.

నర్సరీలో మొక్కలు అనుకున్నంత లేవని ఆరోపణలు ఉన్నాయి?

ప్రస్తుతం నర్సరీలో పెట్టిన బెడ్లలో మొక్కలు మొలకెత్తని స్థానంలో విత్తనాలు పెట్టి జెర్మినేషన్ చేస్తున్నాం.

ఏఏ గ్రామ పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు?

మండల కేంద్రంతో పాటు గుడెబల్లూరు, తంగడిగి, ముడుమాల్, కున్సి తదితర గ్రామాల్లో నర్సరీ ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతున్నాం.

వన మహోత్సవానికి మొక్కలు సిద్ధంగా ఉన్నాయా?

నర్సరీలో మొక్కలు సిద్ధంగా ఉన్నాయి.

న్యూస్ బాక్స్

మరుగుదొడ్ల నిర్మాణ పనులు పరిశీలన

కోస్గి రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కోస్గి ఉమ్మడి మండల పరిధిలోని అమినికుంట్ల గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న పబ్లిక్ టాయిలెట్ గదుల నిర్మాణ పనులను ఎంపీడీవో శ్రీధర్ బుధవారం పరిశీలించారు. గ్రామంలోని వీరభద్ర దేవాలయం వద్ద రూ.3 లక్షల ఎస్‌డీఎం, ఆలయ కమిటీ సంయుక్త నిధులతో నిర్మిస్తున్న టాయిలెట్ గదులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధి హామీ ఇంజనీర్ జయప్రకాష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామాంజనేయులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు బిల్లులు మంజూరు

కొత్తపల్లి, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మొదటి బిల్లు మంజూరు అయ్యింది. కొడంగల్ నియోజకవర్గం కొత్తపల్లి మండలంలోని అల్లీపూర్ గ్రామంలో రెండు ఇళ్ల బేస్‌మెంట్ లెవల్ పూర్తయిన లబ్ధిదారులు కుశలమ్మ, జ్యోతిలకు లక్ష రూపాయల చెక్కులను బుధవారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ లబ్ధిదారులు నిర్మాణాన్ని వేగవంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం వారు అల్లీపూర్, మన్నాపూర్ గ్రామాల్లో రేషన్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జాయినింగ్ నిలుపుదల చేయాలి

మాగనూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తహసీల్‌లో వీఆర్‌ఏగా జాయినింగ్ రిపోర్టు ఇవ్వడానికి వచ్చిన సత్యనారాయణను జాయినింగ్‌ను నిలుపుదల చేయాలని కోరుతూ మండలంలోని గురువులింగంపల్లి గ్రామస్థులు బుధవారం తహసీల్దార్ నాగలక్ష్మికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ సత్యనారాయణ గ్రామానికి చెందిన వ్యక్తి కాదని, ఇతని తండ్రి, తాతలు ఇక్కడ లేరని పేర్కొన్నారు. సత్యనారాయణ ఏ రూల్ ప్రకారం వీఆర్‌ఏ ఉద్యోగం సంపాదించాడో తెలుసుకొని విచారణ చేయాలని గ్రామస్థులు కోరారు. గ్రామంలో చాలామంది నిరుద్యోగులు ఉన్నారని వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని వారు తహసీల్దార్‌ను కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఇడికి రాజుగౌడ్, లక్ష్మణ్, ఆంజనేయులు తదితరులున్నారు.

వడ్వాటులో టీబీ వైద్య శిబిరం

మాగనూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఇంటెన్సిఫైడ్ టీబీ ముక్త్ భారత్ అభియాన్ ప్రోగ్రాంలో భాగంగా మండల పరిధిలోని వడ్వాటు ఆరోగ్య సబ్ సెంటర్‌లో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో మాగనూరు పీహెచ్‌సీ డాక్టర్ అఫ్రోజ్‌పాష వైద్య పరీక్షలు చేశారు. 86 మంది ఛాతి ఎక్స్‌రే చేయగా 36 మందికి పాజిటివ్ వచ్చింది. 22 మంది నుంచి శాంపిల్స్ సేకరించి వాటిని మక్తల్ ల్యాబ్‌కు పంపించారు. వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత వైద్యం చేస్తామన్నారు. మిగతా వారికి మందులు ఇచ్చినట్లు డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాణి, తేజస్విని, ల్యాబ్ టెక్నీషియన్ రాఘవేంద్ర, కేశవ్, భగవంతు, ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై విద్యార్థులకు అవగాహన

ఊట్కూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జిల్లా దివ్యాంగుల, వయో వృద్ధుల, ట్రాన్స్‌జెండర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వినియోగం, వాటి వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నషాముక్త్ భారత్ అభియాన్ వలంటీర్లు, లక్ష్మీకాంత్, సంధ్యలు మాట్లాడుతూ గంజాయి వాడకం వల్ల జీవితాలు నాశనం అవుతాయని అన్నారు. యువత డ్రగ్స్‌కు బానిస అవకుండా చూడాలని తెలిపారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వినియోగించుకోవాలి

- విద్యార్థులందరు ప్రతీరోజు పాఠశాలకు వచ్చేలా చూడాలి
- ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్
- కొత్తపల్లి, బిజ్వార్ గ్రామాల్లో నర్సరీలు, పాఠశాలల ఆకస్మిక తనిఖీ



కొత్తపల్లి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో ఆన్‌లైన్, మ్యానువల్ అటెండెన్స్‌ను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్

ఊట్కూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): రైతులందరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ట్రైనీ కలెక్టర్ ప్రణయ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి, బిజ్వార్ గ్రామాల్లో నర్సరీ, పండ్ల తోటలతో పాటు అంగన్‌వాడీ, పాఠశాలలను తనిఖీ చేశారు. కొత్తపల్లి గ్రామంలో రైతు రాజయ్య వేసిన డ్రాగన్ ఫ్రూట్ తోటను సందర్శించి, సబ్సిడీపై మాట్లాడారు. అనంతరం పాఠశాలలో రికార్డులను పరిశీలించి ప్రతీరోజు ఎఫ్‌ఆర్‌ఎస్ నమోదు చేయాలని సూచించారు. కొత్త పల్లి పాఠశాలలో విద్యార్థులు 20 మంది రాకపోవడంపై మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి పాఠశాలకు వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులకు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఆన్‌లైన్ మ్యానువల్ రికార్డులను పరిశీలించి, పిల్లల బరువు, ఎత్తును చూశారు. అనంతరం బిజ్వార్ పాఠశాలలో విద్యార్థుల క్రాఫ్ట్ ఆర్ట్‌ను చూసి వారిని అభినందించారు. ఎంపీడీవో ధనుంజయ్ గౌడ్, ఎంపీవో ఎంఎల్ఎన్ రాజు, ఏవో గణేష్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, శివశంకర్, గౌతమ్‌గౌడ్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

జిల్లాలో జనరిక్ సేవలు

- ఔషధ దుకాణాల ఏర్పాటుకు అధికారుల సన్నాహాలు
- ప్రస్తుతం మూడు షాపులు
- మరో మూడింటిని మహిళా సంఘాలకు ఇచ్చేలా చర్యలు



డీఆర్‌డీఏ, వైద్యాధికారులతో సమీక్షిస్తున్న అడిషనల్ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ (ఫైల్ ఫొటో)

నారాయణపేట, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మరో మూడు జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని రెండు నియోజకవర్గాలతో పాటు, కోస్గిలో మాత్రమే దుకాణాలు ఉండడంతో నిరుపేదలకు చౌకధరలో జనరిక్ మందులు లభించక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాజాగా ప్రతీ ప్రభుత్వ ఆసుపత్రి వద్ద జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఇటీవల స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ వైద్యాధికారుల సమీక్షలో సూచించారు. దీంతో కొత్తగా మూడు దుకాణాల ఏర్పాటుకు జిల్లా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ముఖ్యంగా నారాయణపేట మండలం అప్పక్‌పల్లి జిల్లా జనరల్ ఆసుపత్రి దగ్గర జనరిక్ మందుల దుకాణం ఏర్పాటు అత్యవసరాన్ని గుర్తించారు. ఈ ఆసుపత్రి పరిసరాల్లో 11 కిలోమీటర్ల వరకు ఎలాంటి మెడికల్ దుకాణాలు లేకపోవడంతో రోగులు, వారి బంధువులు జిల్లా కేంద్రానికి వెళ్లి రావడం జరుగుతోంది. ముఖ్యంగా రాత్రివేళల్లో రవాణా సౌకర్యం కూడా లేక వారు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

కొత్తగా మూడు దుకాణాల ఏర్పాటుకు చర్యలు

జిల్లాలోని మద్దూర్, నారాయణపేటలోని అంబేడ్కర్ చౌరస్తా అర్బన్ హెల్త్ సెంటర్, అప్పక్‌పల్లి జిల్లా జనరల్ ఆసుపత్రి వద్ద మూడు జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. వీటి నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించాలని నిర్ణయించారు. బీ ఫార్మసీ అర్హతతో ఉన్న వారు మందుల దుకాణం నడుపుకోవల్సి ఉంటుంది. కేంద్రం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు వైద్యులు జనరిక్ మందులు రాయాలని అధికారులు చెబుతున్నారు. దాంతో నిరుపేదలకు సరసమైన ధరలకు అందే జనరిక్ మందుల దుకాణాలతో పాటు, వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రోడ్డు విస్తరణ సర్వేను అడ్డుకున్న బాధితులు



బాధితులకు నచ్చజెపుతున్న కమిషనర్ శ్రీకాంత్

మద్దూర్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): చర్చించాకే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని మద్దూర్‌లో సర్వేను బాధితులు అడ్డుకున్నారు. 70 ఫీట్ల మేర విస్తరణ చేపడితే ఎంతమేర నష్టం వాటిల్లుతోందని అంచనా వేసేందుకు మునిసిపల్ అధికారులు బుధవారం సర్వే చేపట్టేందుకు యత్నించగా బాధితులు అడ్డుకున్నారు. 70 ఫీట్ల విస్తరణకు ఒప్పుకునేదే లేదన్నారు. అంత పెద్ద మొత్తంలో విస్తరణ చేపడితే నష్టపోతామన్నారు. మొదట విస్తరణపై చర్చించి తమ అభిప్రాయాలను తెలుసుకున్న తర్వాతే సర్వేను మొదలు పెట్టాలన్నారు. నష్టం అంచనాను తెలుసుకునేందుకే సర్వే చేస్తున్నామని కమిషనర్ బాధితులకు నచ్చచేప్పే ప్రయత్నం చేసినా వారు వినలేదు. త్వరలోనే బాధితులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

అధ్వానంగా బీటీ రోడ్డు

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



కంకర తేలి అధ్వానంగా ఉన్న నారాయణపేట - జక్లేర్ రహదారి

మక్తల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): జక్లేర్ నుంచి నారాయణపేట జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి కంకర తేలి గోతులు ఏర్పడటంతో వచ్చీపోయే వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జక్లేర్ చెరువు కట్టపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నా రహదారికి మరమ్మతులు చేపట్టకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రహదారిపై గోతులు అధికంగా ఉండటంతో గత ఏడాది క్రితం రోడ్డుపై ఉన్న బీటీని తొలగించి గోతులను నింపారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ రహదారికి ఎలాంటి మరమ్మతులు చేయలేదు. నారాయణపేటను జిల్లా కేంద్రంగా ప్రకటించడంతో రాకపోకలు విపరీతంగా పెరిగాయి. ప్రస్తుతం ఈ రహదారి గుండా జక్లేర్‌కు వచ్చేవారు అపసోపాలు పడుతున్నారు. రహదారి మరమ్మతులు ఏళ్ల కాలంగా చేయడం లేదు. ఈ రహదారిపై 20 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత ఉన్న రోడ్డును ఏళ్ల కాలంగా మరమ్మతులు చేయకుండా వదిలేయడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. జక్లేర్ చెరువు కట్టపై పలుమార్లు ప్రమాదాలు జరిగినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

మరమ్మతులు చేపట్టాలి..



జక్లేర్ నుంచి పులిమామిడి - బిజ్వార్ గ్రామాలకు వెళ్లే ప్రధాన రోడ్డు కంకర తేలి అధ్వానంగా, ప్రమాదభరితంగా మారినా ఎవరూ పట్టించుకోవడం లేదు. నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారిపై వచ్చిపోతుంటాయి. అధికారులు తక్షణమే మరమ్మతులు చేపట్టాలి.

- మహేష్‌గౌడ్, బిజ్వార్

గురుకుల కళాశాలలో నేడు స్పాట్ కౌన్సెలింగ్

మరికల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్‌లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రథమ సంవత్సరంలో మిగిలిన ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో ఈనెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ నాగమణిమాల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో వచ్చి స్పాట్ అడ్మిషన్లు పొందాలన్నారు.

నేడు కానుకుర్తి గ్రామానికి ఎమ్మెల్సీ కవిత రాక

దామరగిద్ద, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కానుకుర్తి గ్రామానికి గురువారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రానున్నారని బాపన్‌పల్లి గ్రామ మాజీ సర్పంచు గవినోళ్ల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం ప్రాజెక్టులో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు మెరుగైన నష్టపరిహారం అందించే విషయంలో వారికి మద్దతు తెలిపేందుకు గాను ఆమె కానుకుర్తికి వస్తున్నట్లు పేర్కొన్నారు.

వీహెచ్‌పీ నూతన అధ్యక్షురాలికి ఘన సన్మానం



సురేఖను సన్మానిస్తున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగూరావు నామాజీ

నారాయణపేట న్యూటౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా విశ్వ హిందూ పరిషత్ అధ్యక్షురాలిగా ఎన్నికైన సురేఖ రాంబాబును బీజేపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు నాగూరావు నామాజీ ఆమె నివాసంలో బుధవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో వీహెచ్‌పీ నూతన కమిటీలను ఎన్నుకొని ఆధ్యాత్మిక కార్యక్రమాలను విస్తృతం చేయాలన్నారు. వచ్చే వినాయకచవితిని అంగరంగ వైభవంగా జరుపుకోవాలన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సత్యయాదవ్, నాయకులు వినోద్, సాయిబాబ్జి ఉన్నారు.

మార్కెట్ వైస్ చైర్మన్‌కు సన్మానం

నర్వ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మార్కెట్ వైస్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కృష్ణారెడ్డిని బుధవారం మంత్రి వాకిటి శ్రీహరి సతీమణి లలితమ్మ సన్మానించారు. నర్వలోని కృష్ణారెడ్డి నివాసంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, నాయకులు ఉన్నారు.

వైద్య శిబిరం విజయవంతం

నారాయణపేట న్యూటౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆఫ్ నారాయణపేట, యశోద కేర్ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో పట్టణంలోని యశోద కేర్ హాస్పిటల్‌లో డాక్టర్ రాజ్‌కుమార్, ప్రీతిరెడ్డి పర్యవేక్షణలో బుధవారం శస్త్ర చికిత్స, స్త్రీ వైద్యంపై నిర్వహించిన మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో 200 మందికి ఉచిత రక్తపరీక్షలతో పాటు, మందులు అందించారు. క్లబ్ అధ్యక్షురాలు సరిత హరినారాయణ్‌బట్టడ్ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో పాల్గొన్న వారికి అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ పాస్ట్ గవర్నర్ హరినారాయణ్‌బట్టడ్, కార్యదర్శి సాయినాథ్, కోశాధికారి రాధ సదానంద్‌చారి, భీంచందర్‌గౌడ్, శ్రీనివాస్ లహోటి, సురేందర్‌చారి తదితరులున్నారు.

మందు స్ప్రే యంత్రంలో పడి తెగిన వేలు

మక్తల్‌రూరల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలంలోని గొల్లపల్లి గ్రామంలో రైతు చేతి వేలు పొరపాటున మందు స్ప్రే యంత్రంలో పడి తెగిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గొలపల్లి గ్రామానికి చెందిన తిరుపతి బుధవారం తన పొలంలో మందు స్ప్రే చేస్తుండగా యంత్రంలో పొరపాటున వేలు చిక్కుకుని అక్కడికక్కడే తెగిపడింది. దీంతో ఆయన వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా ప్రథమచికిత్స అనంతరం జిల్లా ఆసుపత్రికి వెళ్లాలని వైద్యులు సూచించారు.

జీవో 33 అమలుపర్చాలి

- మంత్రికి వైద్య విద్యార్థులు, తల్లిదండ్రుల వినతి



మంత్రి శ్రీహరికి వినతిపత్రం అందిస్తున్న నీట్ విద్యార్థులు, తల్లిదండ్రులు

మక్తల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్య ప్రవేశంలో తెలంగాణ విద్యార్థులకే స్థానిక కోటా కేటాయించాలని కోరుతూ బుధవారం రాష్ట్ర యువజన క్రీడలు, మత్స్య, పాడిపరిశ్రమ శాఖ మంత్రి వాకిటి శ్రీహరికి వైద్య విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో కష్టపడి చదివే విద్యార్థులకు స్థానిక కోటా కింద జీవో 33ను అమలుపర్చాలన్నారు. విద్యార్థులకు జీవో అమలుపర్చకపోవడంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. కార్యక్రమంలో దూది సుధాకర్, కొండా విజయ్‌కుమార్, నౌలె విజయ్‌కుమార్, ఉమాకాంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

ఊట్కూర్ : మండలంలోని నిడుగుర్తి గ్రామానికి చెందిన అవ్వకోల్ల బలరాంకు సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.5 లక్షల ఎల్‌వోసీని మంత్రి వాకిటి శ్రీహరి బుధవారం మక్తల్‌లోని తన స్వగృహంలో బాధిత కుటుంబీకులకు అందించారు. కాంగ్రెస్ పార్టీ మండల విజ్ఞేశ్వర్‌రెడ్డి, నాయకులు లింగం, అర్సాత్ తదితరులున్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట కార్మికుల ధర్నా

నారాయణపేట టౌన్/మక్తల్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ టీయూసీఐ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా గురువారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు బి.నరసింహ, సహాయ కార్యదర్శి ఏ.నరసింహ, నాయకుడు కెంచ నారాయణ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఆటో వర్కర్స్, చేనేత కార్మికులతో కరపత్రాల ద్వారా వారు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ వర్కర్స్‌కు రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రమోషన్ ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ వర్కర్స్ వెంకటమ్మ, లక్ష్మి, వీరమణి, ఆటో వర్కర్స్ వెంకటప్ప, మాణిక్యప్ప, లక్ష్మణ్, రమేష్, చేనేత కార్మిక సంఘం అధ్యక్షులు తులసిదాస్, సంగీతబాయ్, లలితబాయ్ ఉన్నారు.

అదేవిధంగా, మక్తల్ పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన హమాలీ కార్మికుల సమావేశంలో టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కిరణ్ మాట్లాడారు. గురువారం కలెక్టరేట్ ఎదుట చేపట్టబోయే ధర్నాను జయప్రదం చేసేందుకు కార్మికులు పెద్ద సంఖ్యలో రావాలని పిలుపునిచ్చారు.

ఇసుక అక్రమ రవాణాను ఆపాలి

- మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మాగనూరు, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి రాఘవ కన్‌స్ట్రక్షన్ ప్రాజెక్టు అధికారులు అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాను నిలుపుదల చేయాలని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి బుధవారం తహసీల్దార్ నాగలక్ష్మిని కోరారు. ప్రాజెక్టు అధికారులు తరలిస్తున్న ఇసుకకు అనుమతి ఉందా అని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. మాగనూరు పెద్దవాగు నుంచి ఇసుకను తరలిస్తే ఈ ప్రాంత రైతులకు, ప్రజలకు తాగు, సాగునీటికి ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. అంతేకాకుండా ప్రభుత్వానికి లక్షల్లో నష్టం వాటిల్లుతుందన్నారు. నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకానికి అవసరమైన పైపులు తయారు చేసుకోవడం కోసం మండలంలోని అడవిసత్యారం గ్రామం వద్దనున్న టీఎస్ఎండీసీ ద్వారా ఇసుకను తరలించాలని సూచించారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుంటే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ప్రభుత్వ అనుమతులతో ఇసుకను తీసుకెళ్లాలని, లేకపోతే రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

పొలాలకు దారి ఇప్పించాలి



పొలాలకు దారి ఇప్పించాలని తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న లోకుర్తి గ్రామ రైతులు

దామరగిద్ద, జూలై 30 (ఆంధ్రజ్యోతి): తమ పొలాలకు వెళ్లేందుకు గాను దారిని ఇప్పించాలని మండల పరిధిలోని లోకుర్తి గ్రామానికి చెందిన 30 కుటుంబాల రైతులు బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ముందు ఉన్న పొలాల రైతులు కొంత మంది కావాలనే దారికి అడ్డంగా రాళ్లు వేసి వెళ్లనీయకుండా అడ్డుకుంటున్నారని వాపోయారు. సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రామకృష్ణ మాట్లాడుతూ గత మూడు నెలల నుంచి ఈ విషయమై అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. తహసీల్దార్ స్పందించి రైతులకు దారి చూపించాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ సర్వే చేయించి దారిని చూపిస్తానన్నారు. వెంకటేష్, రవీందర్, సతీష్, శ్రీను తదితరులున్నారు.

నదీ తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- కృష్ణ ఎస్‌ఐ నవీద్

కృష్ణ, జూలై 30 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు నారాయణపూర్, కోహినా ప్రాజెక్టుల నుంచి 25 గేట్లు తెరిచి దిగువన ఉన్న కృష్ణా, బీమా నదులకు వరద నీటిని వదలడంతో ఆయా నదులు నిండుకుండలా మారాయి. బుధవారం మండలంలోని కృష్ణానదిని ఎస్ఐ నవీద్ పరిశీలించారు. నదుల ఒడ్డున ఉన్న పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. గురజాల, హిందూపూర్, వాసునగర్, ముడుమాల్ తదితర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కృష్ణా నదిలోకి దిగొద్దని, మత్స్యకారులు చేపలు పట్టొద్దని, పొలం పనులకు వెళ్లే రైతులు, పశువుల కాపరులు, సరదాగా ఈత కొట్టడానికి, సెల్ఫీ ఫొటోలు దిగడానికి వెళ్లొద్దని హెచ్చరించారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

భూనిర్వాసితులకు బేసిక్ ధర నిర్ణయించాలి



రిలే దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం

నారాయణపేట టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం అందించేందుకు బేసిక్ ధర నిర్ణయించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం, భూనిర్వాసితుల సంఘం జిల్లా అధ్యక్షుడు మచ్చేందర్ డిమాండ్ చేశారు. భూనిర్వాసితుల రిలే నిరాహార దీక్షలు 16వ రోజుకు చేరుకున్న సందర్భంగా బుధవారం దీక్షా శిబిరాన్ని వారు సందర్శించి, మాట్లాడారు. రైతు తన భూమిని ప్రాజెక్టుకు సంతోషంగా ఇచ్చే విధంగా ప్రభుత్వం పరిహారం అందించాలన్నారు. నిరాహార దీక్షలో కాచ్వార్, ఎర్నాగన్‌పల్లి గ్రామాల నిర్వాసితులు కలాల్ రాజు, నగేష్, బస్వరాజ్‌గౌడ్ తదితరులున్నారు.

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్‌కుమార్‌రెడ్డి, సభ్యులు

నారాయణపేట టౌన్, జూలై 30 (ఆంధ్రజ్యోతి): పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతీ ఒక్కరు విధిగా మొక్కలను నాటాలని భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ కె.రాజ్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన వన మహోత్సవం కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శాసన్‌పల్లి రోడ్డులో ఉన్న కాశీనాథేశ్వర కాలనీలో కాలనీవాసులు, ఫౌండేషన్ సభ్యులతో కలిసి రాజ్‌కుమార్‌రెడ్డి మొక్కలు నాటారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు తమ ఫౌండేషన్ ద్వారా మొక్కలు నాటడం, అవగాహన కార్యక్రమాలను చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గడ్డం తిప్పన్న, మధుసూదన్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, హనుమంతు, చల్లా వెంకటేష్, వై.సంతోష్, మన్నె గోపాల్, నర్సింహ్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.